క్లుప్తంగా

నేడు ఈద్గా అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు భూమిపూజ చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి తెలిపారు. ముస్లిం మైనార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

బీజేపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

ప్రొద్దుటూరు కల్చరల్ : బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్లపాలనలో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రమేష్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నోట్లరద్దు, జీఎస్టీ వల్ల పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దేశసమైక్యతను కాపాడటానికి రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

మూడు రోజులు నీటి సరఫరాలో అంతరాయం

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీలో సోమ, మంగళ, బుధవారాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలు మున్సిపాలిటీకి తాగునీటిని అందించే బృహత్తర తాగునీటి పథకం పైపులైను బి.మఠం మండలం తుమ్మలపల్లె వద్ద మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కానిస్టేబుల్ ప్రిలిమ్స్ ఫలితాల్లో ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఆదివారం విడుదలైన కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపరచారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్‌లు కె.సునీల్, కె.సునీల్ తెలిపారు. తమ కోచింగ్ సెంటర్ నుంచి 82 మంది ఈ పరీక్షల్లో క్వాలిఫై అవడంపై హర్షం వ్యక్తం చేశారు. వీరిని కోచింగ్ సెంటర్ నిర్వాహకులతో పాటు అధ్యాపకులు ఎం.దామోదర్, సురేష్, ఎస్.దామోదర్ అభినందించారు.

ఎస్‌కే గ్రాండ్, శిల్ప కళ గ్రాండ్ ప్రారంభం

ప్రొద్దుటూరు : పట్టణంలోని శ్రీరాములపేటలో గల శ్రీలక్ష్మీకళ శారీస్ ఎదురుగా ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌కే గ్రాండ్, శిల్ప కళ గ్రాండ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉమ్మడిశెట్టి వెంకట వంశీకృష్ణ మాట్లాడుతూ.. పట్టణంలో అందరికీ అందుబాటులో విశాలమైన పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యం, తదితర సదుపాయాలతో సెంట్రల్ ఏసీ ఫంక్షన్ హాల్ అండ్ రెసిడెన్సీ అందుబాటులో ఉందని తెలిపారు. లగ్జరీ ఏసీ గదులతో కలిగిన దీన్ని శుభ కార్యాలకు, సమావేశాలు, సదస్సులకు తక్కువ ధరకే అందుబాటులో ఉంచామని వివరించారు. ఉమ్మడిశెట్టి లక్ష్మీదేవి, లక్ష్మీనారాయణ, సురేఖ, నంద కిషోర్, రమాదేవి పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



అన్నదానం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : అన్నదానం గొప్ప కార్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఈశ్వర్‌రెడ్డి నగర్‌లోని 'అమ్మా నాన్న మదర్ థెరీసా షబ్బీర్' వృద్ధాశ్రమంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిరెడ్డి మాట్లాడుతూ.. ఆశ్రమ నిర్వాహకులు ప్రతి పౌర్ణానికి అన్నదాన కార్యక్రమం చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు హిదాయత్, కౌన్సిలర్ వడ్ల ఖలీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరిముల్లా పాల్గొన్నారు.

కాశినాయన ఆశయసాధనకు కృషి చేయాలి

బద్వేలు అర్బన్ : ఆధ్యాత్మిక గురువు కాశిరెడ్డినాయన ఆశించిన ఆశయ సాధనకు ప్రతిఒక్క భక్తుడు కృషి చేయాలని జ్యోతిక్షేత్ర అభివృద్ధి కమిటీ సభ్యులు కొండానరసింహారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో కాశిరెడ్డినాయన ఫొటోతో ఉన్న ప్యాకెట్ కాలెండర్‌ను ఆవిష్కరించారు. మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంటహనుమంతరావు, విశ్రాంత అధ్యాపకులు శేషారెడ్డి, విశ్రాంత ఉద్యోగి కృష్ణ పాల్గొన్నారు.

నేడు ప్రకాశ్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 7.30 గంటలకు కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రకాశ్ నగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- వలంటీర్లు.. కన్వీనర్లే సారథులు
- ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : కులం, మతం పార్టీలు అన్న భేదాలు లేకుండా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని ఆంజనేయకొట్టాలు దగ్గర ఉన్న కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిన చంద్రబాబుకు మరోమారు బుద్ధి చెప్పాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసి అందరికీ సంక్షేమం అందించిన సీఎం జగన్‌ను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలో అర్హత కల్గిన వారికి ఇళ్లు, పెన్షన్ ఇలా ఏది కావాలన్నా వలంటీర్ల ఇంటి వద్దకు వచ్చి ప్రభుత్వ పథకాలు అందిస్తారన్నారు. వలెంటీర్లు, కన్వీనర్లు కలసి ప్రభుత్వం చేసిన పనులు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. గతంలో జన్మభూమి కమిటీల పేరిట ఎలాంటి అరాచకం జరిగిందో అందరూ చూశారన్నారు. నేడు గ్రామ సచివాలయం, వలంటీర్ల వల్ల ఎంత మేలు జరుగుతుందో అందరికీ తెలుస్తోందని అన్నారు. వలంటీర్లు, కన్వీనర్లే సారథులన్నారు. నాడు- నేడు ద్వారా పాఠశాల రూపురేఖలు మార్చిన ఘనత మన ప్రభుత్వానిదే అన్నారు. రెండవ సారీ సీఎంగా వైఎస్ జగన్‌కు గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నియోజకవర్గ రాజకీయ పరిశీలకుడు యల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, ఆంజనేయ కొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి, కొత్తపేట ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఖాజీపేట మండల వైస్ ఎంపీపీ చంద్రభాస్కర్‌రెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ బావుటా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అమృతా నగర్‌లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అడుగడుగునా ప్రజలతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ బావుటాలను ఇచ్చి జగనన్న ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ రాజారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, వార్డు మెంబర్లు తిరుపాల్‌రెడ్డి, అరుణకుమారి, సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న రామాంజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలామ్ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు గుండ్లదుర్తి రామాంజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్‌కళాశాల రోడ్డులోని తమ కార్యాలయంలో ఆదివారం సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలు భవన నిర్మాణకార్మికులకు అందేలా చూస్తానన్నారు. సంఘం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని వివరించారు. కార్యక్రమంలో సంఘం కన్వీనర్ పద్మవీరన్న, గౌరవాధ్యక్షుడు సంజీవరాయుడు, చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శులు పద్మవినోద్, ఓబులేసుయాదవ్, కో కన్వీనర్ శ్రీనివాసయాదవ్, శ్రీనివాసాచారి, బాలయ్య, రెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బిందు ప్రాశన చుక్కల మందు ఉచితంగా పంపిణీ

చాపాడు ఆయుర్వేద ఆసుపత్రిలో ప్రారంభించిన ఎమ్మెల్యే



ఉచిత చుక్కల మందును పిల్లలకు వేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని ఆదిత్య ఆయుర్వేద గ్రామ్ ఆసుపత్రిలో ఆదివారం చేపట్టిన స్వర్ణ బిందు ప్రాశన చుక్కల మందు ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 16 ఏళ్లలోపు పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపుదల కోసం ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా మందు పంపిణీ చేయటం మంచి విషయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని సూచించారు. ఆయుర్వేద వైద్యులు గూడూరు రవికుమార్ మాట్లాడుతూ.. బిందు ప్రాశన చుక్కల మందు వేసుకోవటం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లల్లో జ్ఞాపకశక్తి మెరుగుపడి ఉత్తేజంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాబ్జీ, రిటైర్డు వీఆర్వో మనోహర్‌రెడ్డి, నాయకులు సీవీ సుబ్బారెడ్డి, జయసుబ్బారెడ్డి, లక్ష్మీరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రజకులు ఐక్యంగా ముందుకు సాగాలి



రజక డైరీని ఆవిష్కరిస్తున్న ఆయా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : రజక కులస్తులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పూలే ఆశయసాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక పూలే ఆశయ సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రజక డైరీని ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు జయరాములు, జిల్లా రజక సంఘం నాయకులు వెంకటరమణ, నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణయ్య, పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య, గోపవరం మండలాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, నాయకులు పెంచలప్రసాద్, డాక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవాలు

మైదుకూరు: పట్టణంలో వెలసిన గ్రామ దేవత శ్రీపెద్దమ్మ తల్లి 24వ విగ్రహ ప్రతిష్ట వార్సికోత్సవాలు సోమవారం నుంచి అయిదు రోజుల పాటు జరుగునున్నాయి. వార్షికోత్సవాల్లో ప్రతిరోజు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

విశ్వనాథపురంలో రామాలయ ప్రతిష్ట వేడుకలు

చాపాడు : మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో నూతనంగా శ్రీ గణపతి సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రుల ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ భూమిరెడ్డి నారాయణరెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆలయ ప్రతిష్ట, సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ కల్యాణం తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట వేడుకల్లో మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్, ఎంపీపీ లక్షుమయ్య, మాజీ ఎంపీపీ గురివిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడికి తీవ్రగాయాలు

మైదుకూరు: పట్టణ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగూరు బయన్న అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల రోడ్డులో తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకునేందుకు వెళుతున్న వృద్ధుడిని నంద్యాల వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

అల్లాడుపల్లెలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



పార్కింగ్ స్థల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థానం వద్ద ఈ నెల 18, 19వ తేదీల్లో నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం అధికారులు పరిశీలించారు. ఆలయ ఈఓ శ్రీనివాసులు, చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ కేసీ రాజు ఏర్పాట్లపై చర్చించారు. ఆలయ పరిసరాల్లో వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పసుపులో అంతర పంటగా కంది



టంగుటూరులో పసుపు పంటలో కంది పంట సాగుచేసిన దృశ్యం

మండలంలోని టంగుటూరు గ్రామంలోని రైతులు పసుపు పంటను సాగు చేస్తారు. అయితే కొంతమంది రైతులు ఆ పంటలో అంతర పంటగా కందిపంటను వేసుకున్నారు. పసుపులో తెగుళ్ల అధికంగా వస్తుంటాయని కందిపంట వేయడంతో తెగుళ్ల పంటకు ఎక్కువగా రావని వారు తెలిపారు. అంతేగాక కందిపంట దిగుబడి కూడా బాగా వస్తుందని వివరించారు.

– రాజుపాళెం

లలితాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక పాతమార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున లలితాదేవికి, శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌ను నూతన పట్టువస్త్రాలతో, వెండికవచాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన, లలితాసహస్ర నామ పారాయణం చేశారు. పూజాకార్యక్రమ అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

■ స్థానిక కొర్రపాడురోడ్డులోని మున్సిపల్ పెట్రోల్ బంకు సమీపంలో మాఘపౌర్ణమి సందర్భంగా శ్రీలక్ష్మీ కుబేర స్వర్ణాకర్షణ భైరవస్వామి ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాసులస్వామి ఆధ్వర్యంలో 500 మంది పైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ట్రస్ట్ సభ్యులు నాని, సాయి, శివకుమార్, సుధీర్ పాల్గొన్నారు.

■ స్థానిక టూటౌన్ సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించి పూలతో అలంకరించారు. సీమాంధ్రబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో నాయిబ్రహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు, చల్లా రవి, సీతంపల్లె రమణ, నాగప్రసాద్, ఈశ్వరరెడ్డి, ఏసునాథరెడ్డి, నల్లం శంకర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ, శివపార్వతుల కల్యాణం



సీతారామ, శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దిగువబ్రాహ్మణ వీధిలో వెలసిన కాశీవిశ్వనాథస్వామి, కోదండరామస్వామి, అభయాంజనేయస్వామి దేవస్థానం అష్టమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఒకే వేదికపై ఏక కాలంలో నిర్వహించిన శివపార్వతుల, సీతారామ కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవోపేతంగా నిర్వహించిన కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భారీ అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి పూలంగిసేవ, ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో మారుతిసేవా సమితి ట్రస్ట్, భజనమండలి సెక్రటరీ ఆవుల శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు చిట్టిస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

బి.కోడూరు : మండలంలోని దంతెలపల్లె గ్రామంలో వెలసిన శ్రీఅచలానంద ఆశ్రమ పాలిత శ్రీరమా సహిత శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉద్యా అమరనాథశర్మ (బుజ్జిస్వామి), ఖాజాబాలసుబ్రమణ్యశర్మ, రామావఝులమాధవశర్మల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. డిస్కోరాజా బృందం చే కులుకుభజన, హైదరాబాద్ గోపాల్ బృందం చే రేలారే రేలా కార్యక్రమం అలరించాయి.

ఘనంగా కుంకుమార్చన



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. అలాగే గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహసారధులు జగనన్న రథసారధులు

శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



సచివాలయ కన్వీనర్‌కు ప్రచార కిట్‌ను అందజేసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

గోపవరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు జగనన్న రథసారథులు అని ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గ పరిశీలకులు ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని పి.పి.కుంటలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. జగనన్న పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. అందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎండకడుతూ జగనన్న పాలనలో జరిగిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. అందుకు మీరంతా జగనన్న కుటుంబంలా పనిచేయాలని తెలిపారు. 2024 ఎన్నికలే లక్ష్యంగా భావించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తే మరో 25 ఏళ్ళ పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం తథ్యమన్నారు. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో ఏవిధంగా పార్టీ కోసం పనిచేశారో మరో ఒకటిన్నర సంవత్సరం పాటు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. బద్వేలు నియోజకవర్గంలో 80 వేల కుటుంబాలకు రూ.1600 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఇది కాకుండా మరో రూ.500 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించిన విషయం ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. బద్వేలు నియోజకవర్గంలో పరిశ్రమ వస్తుందని ఏనాడైనా ఊహించారా అని వారు అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు 500 ఎకరాలు కేటాయించడం జరిగిందని, అందులో 100 ఎకరాలు సెంచూరీ ప్యానల్‌కు, మరో 400 ఎకరాలు ఇతర పరిశ్రమలకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఒక పెద్ద ఇండస్ట్రీయల్ హబ్‌గా ఈ ప్రాంతం ఉండబోతోందని, పులివెందుల తర్వాత బద్వేలు ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ బద్వేలు మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రమణారెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ అభివృద్ధి సలహాదారుడు నాగార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సరస్వతమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ పుల్లయ్య, మాజీ సర్పంచ్ కుప్పాల శ్రీరాములు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలబడదాం

అట్లూరు : మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మన మందరం అండగా నిలబడదామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టరు సుధా, బద్వేలు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు జగన్‌మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి తోటలో సచివాలయ కన్వీనర్లు, గృహసారధులకు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు మన ముఖ్యమంత్రి అందజేశారన్నారు. కనుక ప్రతి ఇంటికీ గృహ సారధులు వెళ్లి ఆకుటుంభానికి ప్రభుత్వం ద్వారా అందిన పథకాలపై వివరించి మన ఓటు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి వేయాలని కోరాలన్నారు. అట్లూరు మండలానికి కూడా లెదర్ లేదా కుట్టు పరిశ్రమను మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరాతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి, వెన్నపూస ప్రతాప్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనరు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, కుంభగిరి సర్పంచు గంగమ్మ, కుంభగిరి ఎంపీటీసీ సభ్యుడు గంగయ్య, మండల నాయకులు పొన్న ఓబు బ్రహ్మనందరెడ్డి, రాజారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.